# ప్రళయకావేరి కథలు



స.వెం.రమేశ్

# ప్రళయకావేరి కథలు

స. వెం. రమేశ్

Publications
2005

**Pralayakaveri Kathalu**
(Pralayakaveri stories)
by
**Sa. Vem. Ramesh**

*© Reserved*

*Publication*: January, 2005

*Printed & Published by*
**Dr. G.Chakradhar**
for Media House Publications

| | | |
|---|---|---|
| *Cover Design* | : | **Mohan** |
| *Cover Photo* | : | **Sunkara Harish** |
| *Illustrations* | : | **Chidambaram** |
| *Typesetting* | : | **Nallamotu Raghu Ramaiah**<br>&: (040-2416 0318) |
| *Printed at* | : | **Akruthi Offset Printers**<br>H. No. 1-1-191/A, Chikkadpally<br>Hyderabad - 500 020<br>&: (040-2766 4525) |

*For Copies:*

l **Media House Publications**
1-9-289/4, Behind Post Office
Vidyanagar, Hyderabad - 500 044
&: 040-2760 7307

l **Visalaandhra Book House**

l **Navodaya Book House**
Street Opp. to Arya Samaj Mandir
Kachiguda, Hyderabad - 500 027

*Price:* **Rs. 50**

# అంకితం



నాకు కథలు వ్రాయడం రాదు బాబాయ్ అన్నా విన కుండా, నువ్వు కథ వ్రాస్తేనే బయటకొచ్చేది అంటూ నన్ను గదిలోపెట్టి, గదికి గడియపెట్టి, నాలో కథకుడిని బయట పెట్టిన మా బాబాయి డా॥ సామల రమేష్ బాబుకు, నా కథల తొలిశ్రోత మా పిన్ని డా॥ సామల దుర్గావతికి ప్రేమతో ఈ కథలు అంకితం.

**–స. వెం. రమేశ్**

# అభినందనలు, ఆశీస్సులు

ఒకనాడు ఊరికి వెళ్ళబోతూ, 'ఒక కథను వ్రాశాను, చూడండి బాబాయ్' అంటూ వ్రాతప్రతిని నా చేతిలో పెట్టాడు సం. వెం. రమేశ్. తీరుబడిగా ఆ కథను చదివాను. ఆసాంతం చదివించడమేగాక, తర్వాత కొంత సమయం వరకు ఒక ప్రశాంత గంభీర స్థితిలోకి నన్ను నెట్టివేసింది. ఇలాంటి మరికొన్ని కథలు వస్తే బాగుండునని అనిపించింది. 'ప్రళయకావేరి'కీ రమేష్‌కూ ప్రగాఢ అనుబంధం ఉన్నదని నాకు అంతకుముందే చూచాయగా తెలుసు. రెండు మూడుసార్లు ప్రళయకావేరి గురించి తాను నాకు చెప్పినప్పుడు వీటిని కాగితం మీద పెట్టరాదా అని సూచించాను కూడా. రమేశ్ చేత కాగితంమీద కలం పెట్టించాలంటే వెంటపడాల్సిందే. పిల్లలతో, సన్నిహితులతో కలిసిపోయి, రకరకాల మాండలికాల్లో వారితో మాట్లాడుతూ, కథల్నీ, సామెతల్నీ చెప్తూ అందరి మనసుల్లోకి చొచ్చుకుపోవడం రమేశ్‌కున్న ప్రత్యేకతల్లో ఒకటి. దీన్ని గమనించిన నేను రెండేండ్ల క్రితం అతనిచేత ఒకటి రెండు కథలు వ్రాయించాను. అతనిలో ఉన్న కథకుణ్ణి అప్పుడే పట్టుకున్నాను. మళ్ళీ ఇన్నాళ్ళకు తనంతటతానుగా చక్కటి కథను వ్రాసి చూడమని నాకివ్వడం నాకెంతో ఆనందాన్ని కలిగించింది.

ఇప్పుడీ 'ఉత్తరపొద్దు' కథతో రమేశ్‌లో ఉన్న కథకుడు – అచ్చ తెలుగులో ప్రజల భాషలో వ్రాయగల ఒక యువకథకుడు – నాకు ఇంకా బాగా ప్రత్యక్షమయ్యాడు. కాని, కథా రచయితగా పేరు తెచ్చుకోవాలన్న కోరిక అతనిలో ఏ కోశానా లేదు. మరి, ఈ కోవలోనే ఇంకా కొన్ని కథల్ని – ప్రళయకావేరి కథల్ని – అతనిచేత వ్రాయించడం ఎలా?!

చేతిలో ఉన్న ఇంత చక్కటి కథను నా పత్రికలో ప్రచురించడం నాకెంతో సంతోషాన్ని కలిగిస్తుంది. కాని, అందువల్ల మరికొన్ని 'ప్రళయకావేరి కథలు' రావడం మాత్రం త్వరగా జరగదు. నా సంపాదకత్వంలోని నడుస్తున్న చరిత్రలో వచ్చిన అతని వ్యాసాల వల్ల, సామాజిక రాజకీయ రంగాల్లో ఉన్న మేధావులకు, తాత్వికులకు, ఉద్యమశీలురకు రమేశ్ అప్పటికే సుపరిచితుడు. నెలకో కథను ప్రచురిస్తున్నా, నడుస్తున్న చరిత్ర కథా సాహిత్యవేదిక కాదు. కథా రచయితలకు, కథా సాహిత్యాన్ని ఎక్కువగా ఇష్టపడే పాఠకులకు స. వెం. రమేశ్ పరిచయం కావాలి. అందుకు తగిన పత్రికలో ఈ కథ దర్శనమిస్తే, దానిపై పాఠకుల నుంచి వచ్చే స్పందన రమేశ్‌కు కావలసిన ప్రోత్సాహాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది. అప్పుడు ప్రళయకావేరి కథలు మరికొన్ని తప్పక వస్తాయి. ఈ ఆలోచనతో నేను, పెద్దలు ధర్మారావుగార్ని సంప్రదించాను. ఆ తర్వాత ధర్మారావు గారితో కలిసి, ఆంధ్రజ్యోతి కార్యాలయానికి వెళ్ళి వసంతలక్ష్మి గారిని కలిశాము. మా ఆలోచనను ధర్మారావుగారు రెండు వాక్యాల్లో చెప్పి వ్రాతప్రతిని వారికి ఇచ్చారు. 'ఆదివారం ఆంధ్రజ్యోతి' (2003 డిసెంబరు 7) సంచికలో వచ్చిన 'ఉత్తర పొద్దు' కథపై ఎందరో పాఠకులు స్పందించారు. ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. 'ఉత్తరపొద్దు' కథను చదివిన దాశరథి రంగాచార్య గారు – 'ఉత్తరపొద్దు' తెలుగు పున్నమి వెన్నెట్లో దిశాంబరంగా సాగిపోతున్న బతుకు చక్కదనం.

కలుపు మొక్కలేని తెలుగుపంట ...– అన్నారు. ఇది తొలి స్పందనగా ఆంధ్రజ్యోతి ఆది వారం సంచికలో ప్రచురితమయింది.

ఆశించిన విధంగానే 'ఆదివారం ఆంధ్రజ్యోతి' నుండి రమేశ్‌కు పిలుపు వచ్చింది. 'ప్రళయకావేరి కథలు' అనే శీర్షికన ధారావాహికంగా వ్రాయమన్నారు. దీనితో మరికొన్ని కథలు రమేశ్ కలం నుంచి వచ్చాయి. 2004 మార్చి 21 ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రారంభమై, జులై 25 సంచిక వరకు ప్రతి ఆదివారం ప్రళయకావేరి కథలు పాఠకులకు విందు చేశాయి. తెలుగు పాఠకుల మనసులో చక్కటి కథా రచయితగా అతనికి గుర్తింపు లభించింది. 'ఉత్తరపొద్దు' కథను 'కథ 2003' సంకలనంలో చేర్చుకున్నారు. కథా సాహిత్యాన్ని ఇష్టపడే తెలుగు ప్రజలు ఇప్పుడు స. వెం. రమేశ్ నుంచి మరికొన్ని కథల కోసం ఎదురుచూస్తున్నారు.

తెలుగు భాషకోసం అంకితమై పనిచేస్తున్న కార్యకర్త స. వెం. రమేశ్. తమిళనాడులో తెలుగుభాషా సంస్కృతుల పరిరక్షణ, అభివృద్ధి అతని కార్యక్రమం. అతని నిరంతర కృషిని గుర్తించిన తెలుగు భాషోద్యమ సమాఖ్య, అతనిని రాష్ట్రేతర ప్రాంతాల కార్యదర్శిగా నియమించింది. తెలుగు భాషోద్యమ స్ఫూర్తితో చెన్నై కేంద్రంగా తమిళనాడులో తెలుగు భాషా పరిశోధన, బోధన, ప్రచారాల కోసం ప్రారంభమైన 'తెలుగువాణి' (ట్రస్టు) సభ్యుడుగా, పూర్తి సమయ కార్యకర్తగా ఉన్నాడు.

ఈ పుస్తకంలో వెలుగు చూస్తున్నవే గాక మరికొన్ని ప్రళయకావేరి కథలు అతడి కలం నుంచి రావాలి. అతడు పనిచేస్తున్న కార్యరంగంలో పొందే అనుభవాల నుంచి, అనుభూతుల నుంచి మరెన్నో కథలు పుట్టుకు రావాలి.

34 ఏళ్ళ యువకుడు రమేశ్. అయిదారు దశాబ్దాల జీవితం అతని ముందుంది. తెలుగు భాష రక్షణకోసం, అభివృద్ధికోసం సాగుతున్న ఉద్యమంలో తొలి కార్యకర్తల శ్రేణిలో ముందు నడుస్తున్నాడు. అతనిలోని కార్యకర్తృత్వానికి రచనా నైపుణ్యం కూడా తోడైతే, చరిత్రలో ఒక ప్రశంసాత్మక స్థానం అతనిదవుతుంది.

ఇంత మంచి కథల సంపుటిని నాకు, నా శ్రీమతికి చిరంజీవి రమేశ ప్రేమతో అంకితమివ్వడం మాకెంతో ఆనందాన్ని కలిగిస్తున్నది. మేము కథల్ని చదివి ఆనందించగలమే గాని, ఏనాడూ కథలు వ్రాయలేదు. నాలుగేళ్ళ క్రితం హోసూరులో నడుస్తున్న చరిత్రను కొని చదివి, అందులో వున్న చిరునామా ప్రకారం వచ్చి పరిచయం చేసుకున్న స. వెం. రమేశ్, ఇప్పుడు మాకు పెద్ద కుమారుడు. ఇది కాలం కుదిర్చిన ఆత్మీయ బంధుత్వం. ఈ జన్మకిదొక గొప్పతనం.

చిరంజీవి రమేశ్‌కు అభినందనలు, ఆశీస్సులు.

**సామల రమేష్‌బాబు**
సంపాదకుడు
**నడుస్తున్న చరిత్ర** (మాసపత్రిక)

విజయవాడ
18-11-2004



# ఈ కథలను నేనెందుకు వ్రాశానంటే?

మా తాత నాకు చెప్పిన కథల్లో ఒక కథను ఇక్కడ చెప్పుకోవాలి. ఒక ఈగ తన ఇంటిని అలుకుతూ ఉండగా తన పేరు మరచిపొయ్యిందంట. ఎంత ప్రయత్నించినా గుర్తు రాలేదు. దాంతో దిగులు పడిపోయి కనిపించిన వారందరినీ తన పేరేమిటని అడిగి అడిగి చివరి కెట్లాగో తెలుసుకుంటుంది. ఏదయినా కథను చెప్పిన తరువాత ఆ కథ ద్వారా నేను తెలుసుకున్నదేమిటని తాత అడిగేవాడు. ఆ పొద్దూ అట్లే అడిగితే నేను బదులు చెప్పలేక బిక్కమొకం పెట్టినాను. తాత నవ్వి "అబయా! మనం మన పేరునన్నా మరిచిపోవచ్చుగాని అమ్మ పేరుని మటుకు మరువగూడదురా" అన్నాడు.

"మాయమ్మ పేరు నాకు గుర్తుండ్లా తాతా!" అన్నాను సంబరంగా నేను.

"అమ్మంటే కన్నతల్లి మటుకే కాదురా. అమ్మంటే అమ్మబాస కూడా. అమ్మంటే అమ్మ నేల కూడా" అన్నాడు తాత.

తాత కట్టె నాకు దూరమయి ఇన్నేండ్లయినా, తాత మాటలు నన్ను విడువక పట్టి నడుపుతూనే వున్నాయి.

ప్రళయకావేరి – అందమైన పేరుగల అందమైన సరస్సు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఎక్కువగా, తమిళనాడు తిరవళ్ళూరు జిల్లాలో కొద్దిగా పరుచుకున్న ఉప్పునీటి సరస్సు. సరస్సులో నలభై వరకూ దీవులు. మనిషికీ మనిషికీ, దీవికీ దీవికీ నడుమ కంటికి కనిపించని అనురాగ సేతువులు. ప్రళయకావేటి పల్లెల్లో తిరుగుతూ ఉంటే ఆ పల్లీయుల నోట ఎన్నెన్ని కథలో, ఎన్నెన్ని పాటలో ... ప్రళయకావేటి పుట్టుక గురించి, ప్రళయకావేట్లోని పెద్ద పుణ్యక్షేత్రం 'పంట రంగం' గురించి పల్లె పల్లెలోనూ రకరకాల కథనాలు.

మూడు కాలాల ననుసరించే ఆరు ఋతువులూ, ఋతువుల కనుగుణంగా రంగులు మార్చుకునే ప్రళయకావేరీ, సముద్రాన్నీ ప్రళయకావేటినీ కలుపుతూ నాలుగు ముఖ ద్వారాలూ, నాలుగు ముఖద్వారాలనూ తాకుతూ పోయే ఉప్పు కాలువ, ఎగువ సిద్ధలయ్య కొండల్లోంచి బిరబిర పరుగెత్తి వచ్చి ప్రళయకావేరమ్మ ఒళ్ళు తడిపే నదులూ, వంకలూ, వాగులూ, ఎక్కడో ఎరగని తీరాలనుంచి వచ్చి వాలి, ఆరు నెలలు సేదతీరే వలసపిట్టలూ, చిన్న తోటలో చిక్కగా పరుసుకున్న చిల్లచెట్ల సాళ్ళూ, కరిపేటికి చిలకేటికి నడుమ నూర్లు నూర్లుగా బార్లుదీరిన తాళ్ళూ, అప్పుడొకటి అప్పుడొకటి ఉప్పుకాలవలో సాగే పడవలూ పక్కనే పడమట ఉన్న గట్టినేల నుంచి వచ్చి ఆడి పాడి అలరించే జానపద కళాకారులూ, పెద్దీటి గొల్లలూ, యానాదులూ, తూరుపు రెడ్లూ, వెలమలూ, బేరిసెట్లూ, పట్టపు కాపులూ, దేశూరురెడ్లు, ఒకే సమాజంగా బ్రతుకుతూ కూడా కుల కులానికీ మారే తెలుగు యాసా, మాటలూ...

పులికాట్ – పేరులోనూ, ఊరులోనూ తనదనం లేని ఉప్పుకయ్య. సుమారు యాబ యేళ్ళ క్రితం భాషల పేరుతో రాష్ట్రాల నేర్పరచుకొన్నప్పుడు ప్రళయకావేరమ్మను పంచుకున్నారు. తల తమిళనాడులో మొండెం ఆంధ్రదేశంలో. ఈ యాబయేళ్ళలో పులింజేటి,

చిలకేటి యెల్లలమీద ఎందరు పట్టపు వారి తలలు తెగినాయో లెక్కేలేదు. ఎందరు జాలరి స్త్రీల పుస్తెలు పుటుక్కుమని ప్రళయకావేట్లో కలిసినాయో అంతేలేదు. ప్రళయకావేరమ్మకిది తొలి దెబ్బ.

సుమారు ముప్ఫైయేళ్ళ క్రితం ప్రళయకావేటి గుండెకాయ అయిన శ్రీహరికోట దీవిని డా॥ విక్రం సారాభాయ్ నేతృత్వంలోని భారత శాస్త్రవేత్తల బృందం రాకెట్ ప్రయోగానికి అనువయిన చోటుగా గుర్తించింది. ప్రళయకావేరి గుండెలమీద పేట నుంచి కోటకు తారుబాట. మనం అభివృద్ధి చెందుతున్నాం అనే ఆనందంలో కేరింతలు కొట్టారు శ్రీహరి కోట దీవిలోని పల్లెల ప్రజలు. ఆ కేరింతలు గొంతు గూడు దాటక ముందే వారి సొంత గూటిని లాక్కొని బయటకు తరిమినారు. చంగలపాళెం. కీపాక, జోనిగపాళెం, పల్లెవీధి, కాకరమూల, కిళివేడు, రవణప్ప సత్రం, వంటోరిపాళెం, సూళ్ళదొరువు, రెట్టమూల, తెట్టుపేట, పులింజేరి కుప్పం, సెనిగోరి పాళెం, దొరవారి పాళెం, కలవాగు, బేరిపేట, కొత్తచేను, పెనుమాక, మావళం పల్లెల ప్రజలను ప్రళయకావేరి నుంచి దూరంగా విసిరి వేసింది కేంద్ర ప్రభుత్వం. పునరావాసం పేరుతో ప్రళయకావేటికి నూరుమైళ్ళ దూరంలోని మెట్ట భూములను వీరికి చూపించింది. ఈ పల్లె బ్రతుకులతో పాటు చరిత్రకు ఆన వాళ్ళయిన ఎన్నో ప్రాచీన దేవాలయాలు కూడా శిథిలమయి శ్రీహరికోట రాకెట్టు కేంద్రం క్రింద నలిగి నాశనమయి పోయినాయి. ఇది ప్రళయకావేటికి రెండో పెద్ద దెబ్బ.

సుమారు పదేళ్ళ క్రితం మరోసారి అభివృద్ధి పేరుతో ప్రళయకావేట్లోని దీవులన్నింటికీ గులక బాటలు, కరెంటు తీగలు వచ్చి చేరినాయి. దీవి దీవికి బస్సులు పడినాయి. పేటకు రాకపోకలు సులువయ్యింది. ప్రజలలో నాగరికత పెరిగింది. ఎట్లాంటి నాగరికతను కున్నారు? ఏడాదికొకసారి రెండు నెలలు, సేద్యపు పనులు ముగిశాక వచ్చే కల్తీలేని తాటి కల్లుతో గొంతు తడుపుకొని ఆనందించే పల్లె ప్రజలు, ఇప్పుడు ఏడాది పొడుగునా పేటలో దొరికే చీప్ లిక్కర్‌తో ఒళ్ళు తడుపుకుని గుల్లవుతున్నారు. ఒకటి రెండు వానలుపడితే పండే తమదల్ని వదిలేసి, దండిగా నీరు కావలసిన వరిపంటను పండించడం మొదలు పెట్టారు. పంట నీటికోసం ప్రళయకావేట్లో మట్టికట్టలు పోసి చెరువులు చేసుకున్నారు. చెరువులయితే చేసుకున్నారుగాని వాలూ, వాగూ లేని ప్రళయకావేట్లో ఆ చెరువుల్లోకి మంచినీళ్ళు వచ్చేదెట్లా? ప్రభుత్వం వేసిన గులకబాటలూ, ప్రజలు వేసుకున్న చెరువుకట్టలు కలిసి, ప్రళయకావేట్లోని సహజమైన ఉప్పునీటిని అటూ ఇటూ కదలనీక చేశాయి. ప్రళయ కావేట్లో కలిసే ప్రవాళం, కాళంగి, స్వర్ణముఖి, అరుణ, కరిపేరు, చిలికేరుల్లో వానలేకా, ఎగువ ఆనకట్టలు కట్టేయడం వలనా నీరు పారడం నిలిచిపోయింది. దాంతో పామంజేరు, సామంజేరు, వేపంజేరు, పులింజేరు ముఖద్వారాలలో ఇసుక మేటవేసి ఆటుపోట్ల ద్వారా వచ్చే సముద్రపు నీరు తగ్గిపోయింది. పేటలోని సినిమాలను మరిగి, ప్రళయకావేటి వారు జానపదాలను మరచిపోయినారు. ఇది ప్రళయ కావేటికి అతి పెద్ద మూడో దెబ్బ.

ఇది వరకు ఏడాదికొకసారి ఎండే ప్రళయకావేరి ఇప్పుడు ఏడాదికొకసారి ఎప్పుడన్నా అరుదుగా నిండుతోంది. ఇప్పుడు ప్రళయకావేట్లో అప్పటి జానపదాలు లేవు. ప్రళయ



కావేరి పుట్టుకను గురించి కథలు చెప్పేవారు లేరు. తమద సంగటి, రొయ్య పులుసు లేవు. తెల్లోళ్ళు ఉప్పుమీద పన్ను వేసినప్పుడు ఆ ఉప్పు కయ్యల్లో ప్రజలు పడ్డ కష్టాలనూ, గాంధీతాత పిలుపుతో ఉప్పు ఉద్యమంలోకి దూకి, ప్రళయకావేటిని కాపాడుకున్న విష యాన్ని ఇప్పుడు గుర్తు తెచ్చుకునే వారు లేరు. అసలిప్పుడు ప్రళయకావేరనే పేరే లేదు. పర్యాటకశాఖ వారి పుస్తకాల్లో పులికాట్ అనే పేరూ, ఎండిన ఉప్పుకయ్యలు, జీవంలేని జనులు, ఇంతే.

ఇదంతా, ఇవన్నీ కళ్ళముందే ఒక్క బతుకులోనే, తటాలున, చటుక్కున మాయమై పోవడం, అంతరించిపోతున్న ఆ సరస్సు జీవనాన్ని చూస్తూ ఏమీచేయలేక, వూరుకోలేక నరకయాతన పడడం ... ఆ భావాల్ని అక్షరాల్లో వ్రాయడం కష్టం. అయినా నా భావాలను నలుగురితో పంచుకోవాలనుకున్నాను. ఆ భావాలకు అక్షర రూపమే నా ప్రళయకావేరి కథలు. అమ్మ బాసనీ, అమ్మ నేలనీ మరువకూడదన్న తాత మాటల స్ఫూర్తితో వ్రాసినవే ఈ కథలు. ఈ కథలు వ్రాస్తున్నప్పుడు ఎన్నో ఉత్తరాలు, కొన్ని ఫోన్లు. "నేనేరా తప్పిపోయిన లోలాకుని' అంటూ ఓ మిత్రుడు. "ఐక్కోడా! నేనురా గుండుపద్మాని. ఉపాధ్యాయురాలిగా రిటైర్ అయినాను. నువ్వు ఏం చేస్తున్నావంటూ" ఒక తల్లి పలకరింపు. ఒకనాడు చెన్న పట్నం నుంచొక ఫోను, ఇస్రో ఇంజనీరట. ఉపగ్రహం పంపిన చిత్రాల్లో ఇదివరకు కావేరి నది, ఇప్పుడు ప్రళయకావేరి ఉన్న చోట సముద్రంలో కలిసేదట. భూకంపాల వలన తరువాత దిశ మార్చుకుందట. నా కథలను మెచ్చుకుంటూ ఈ విషయాలను చెప్పినప్పుడు ఎంత సంతోషించినానో.

ఎందరో నా కథలను మెచ్చుకున్నారు. కొందరు నా కథలలోని లోపాలను ఎత్తి చూపి, నన్ను సరిదిద్దినారు. 'ఆడే వయసులో ఆడాల', 'పుబ్బ చినుకుల్లో' కథలకు అంత మంచి పేర్లను పెట్టింది ఖదీర్‌బాబు గారు. ఉత్తర పొద్దు కథకు అక్బర్‌గారు, మిగిలిన కథలకు చిదంబరం గారు నా మనసు చదివినట్లు బొమ్మలేశారు. మొదట ఆంధ్రజ్యోతి వాళ్ళకు నా కథలను ఇచ్చి తర్వాత నన్ను బలవంతంగా వారిని కలవమని ఆజ్ఞ జారీ చేసింది ధర్మారావుగారు. కథలను ముద్రించడమే కాదు, నడుమ నడుమ నా సందేహాలను విసుక్కోకుండా తీర్చారు వసంతలక్ష్మి గారు. వీరందరికీ కృతజ్ఞతలు. ఈ కథలను ప్రచు రించిన ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, ముఖ్యంగా సంపాదకులు కె.రామచంద్రమూర్తి గారికి ధన్యవాదాలు.

ఈ పుస్తకం అట్టమీద ఉపయోగించిన ఫోటోను అందించిన సుంకర హరీష్ గారికి, అందంగా అట్టను తీర్చిదిద్దిన ప్రసిద్ధ ఆర్టిస్టు మోహన్ గారికి, తప్పులు లేకుండా అక్షరాలు కూర్చిన నల్లమోతు రఘురామయ్య గారికి, అందంగా ముద్రించిన ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ కిరణ్ గారికి, ఈ పుస్తకాన్ని వెలుగులోకి తెచ్చిన మీడియా హౌస్ పబ్లికేషన్స్‌కు, ఆ సంస్థ అధిపతి డాక్టర్ గోవిందరాజు చక్రధర్ గారికి కృతజ్ఞతలు. అన్ని విధాలా నాకు అండగా నిలిచి ప్రోత్సహిస్తున్న పెద్దలు పి.వేణుగోపాల్‌రెడ్డి గారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు.

**-స. వెం. రమేశ్**

# ఇదీ క్రమం


ఉత్తరపొద్దు ................................................ 11

కాశెవ్వ బోగాతం ................................................ 18

పాంచాలి పరాభవం ................................................ 23

ఎచ్చలకారి సుబ్బతాత ................................................ 27

కత్తిరిగాలి ................................................ 32

మామిడి చెట్టు - కొరివి దెయ్యం ................................................ 37

ఆడే వొయిసులో ఆడాల ................................................ 43

కొత్త సావాసగోడు ................................................ 49

నల్లబావ తెంపు ................................................ 54

పద్దినాల సుట్టం................................................ 61

తెప్పతిరనాళ ................................................ 67

ప్రవాళ ప్రయాణం................................................ 72

పుబ్బ చినుకుల్లో... ................................................ 81

అమ్మపాల కమ్మదనం................................................ 86

అటకెక్కిన అలక ................................................ 90

సందమామ యింట్లో సుట్టం ................................................ 95

పరంటీది పెద్దోళ్ళు................................................ 100

మంట యెలుతుర్లో మంచు ................................................ 105

దాపటెద్దు తోడు ................................................ 110

ఆడపాడుసు సాంగెం ................................................ 116

వొళ్ళెరగని నిదర................................................ 123






# ఉత్తరపొద్దు

మా ఊరిని ఆనుకొనే ఉంది ప్రళయకావేరి. సుమారు ముప్ఫై మైళ్ళ పొడవు, పదిమైళ్ళ వెడల్పు ఉన్న సరస్సు అది. ప్రళయ కావేట్లో నలభై వరకూ దీవులున్నాయి. వాటికి రక రకాల పేర్లు. వాటిల్లో కొన్ని దీవుల్లో మాకు చుట్టాలున్నారు. ఆ దీవుల్లో ఒకటి 'జల్లల దొరువు' విసిరేసినట్లు ఒక మూలగా ప్రళయకావేరి ఒడిలో ఒదిగి ఉండేది. ఆ దీవిలో మా తాత వాళ్ళు వుండేవాళ్ళు. నేను తరచూ అక్కడకు పోతుండేవాడిని.

'జల్లల దొరువు' ప్రయాణమంటే చిన్న విషయం కాదు. తెల్లవారి అయిదు గంటలకు మొదలుపెడితే రాత్రి ఏడుకో, ఎనిమిదికో ఆ దీవికి చేరేవాళ్ళం. అంటే ఒక పగలంతా ప్రయాణమే.... కాసేపు నీళ్ళల్లో నడిచి కాసేపు దీవుల్లో నడిచి .... ఒక దీవి నుంచి ఇంకో దీవిని దాటి .... చేరుకోవాలి. ఇంతా చేసి మా ఊరికీ, 'జల్లల దొరువు'కి నడుమ దూరం పాతిక కిలోమీటర్ల లోపే.

ప్రళయ కావేట్లో ప్రయాణం ఒక వింత అనుభూతి. నడిచి నడిచి కాళ్ళు పీకుతున్నా, ఇంకా నడవాలనే మనసు పీకుతుంటుంది. ఎండా, వానా, మంచు .... ఇవన్నీ కాలానికి అనుగుణంగా సరస్సులో ఎరగనన్ని వన్నెలు చూపించేవి. మా ప్రయాణం ముచ్చట్లు మొదలుపెడితే మీకూ తెలుస్తాయి – ఆ వన్నె చిన్నెలు.

ఒకసారి నేనూ, మా వెంకటన్న, నా నేస్తాలు శీనయ్య, చెంగయ్య నలుగురం ప్రయాణం కట్టినాము ప్రళయకావేరిలో. శీనయ్య, చెంగయ్యలు 'రాగన్న పట్టెడ'కు, నేనూ. మా అన్న జల్లల దొరువుకు. అప్పుడు నా వయస్సు పన్నెండో, పదమూడో ఉండొచ్చు. అప్పటికి ఉత్తరకార్తె పెట్టి రెండు దినాలయింది. ఆ ఏడాది మఖ, పుబ్బల్లోనే గట్టి వానలు పడినాయి. అందుకే మా అమ్మకూ, మా అవ్వకూ మా ప్రయాణం అంటే దిగులు.

"దార్లో వానొస్తే 'రాగన్నపట్టెడ'లోనే నిలిచిపోండి. ఉత్తర పొద్దులో కావేట్లో దిగబాకండి" మా అమ్మ హెచ్చరించింది.

"ఉత్తర పొద్దంటే వాళ్ళకేం తెలస్తాదమ్మే!" అని మాయమ్మని ఒక్క కసురు కసిరింది మా అవ్వ.

మా వైపు తిరిగి "నాయినా! మద్దినేళ మడకలిప్పే పొద్దులో పెళయకావేట్లో నడవబాకండ్రా" అనింది.

"పునమాలతిప్ప దాటినాక, చిన్నతోటకు పొయ్యేదాకా దిగులు తిప్ప లెక్కువ. చూసి నడవండి" మా పెద్దమ్మ సలహా ఇచ్చింది. 'దిగులుతిప్ప' అంటే ఒక రకమైన బురదగుంట. ఊబికాదు. ఇందులోకి దిగితే నడుముల దాకా కూరుకుపోతాము.

"ఉత్తరపొద్దు బిడ్డల్ని ఏమారస్తాదేమో!" మా అవ్వ గొణగసాగింది.

ఆడవాళ్ళ సణుగుడంతా విన్న మా తాత లేచి "మేయ్! గమ్మనుంటారా? లేదా? అయినా పంట రంగస్వామి లేడా. ఏదన్నా అయితే చూసుకొనేదానికి. పొయి రానీ వాళ్ళని" అన్నాడు.

మా వైపు చూసి "అబయా, నలగామూల దాటినాక, పెళయకావేరమ్మకు సక్కల గిలెక్కువ. మునేళ్ళు అదిమిపెట్టి నడవండి. లేకపోతే గెబ్బిడు గెబ్బిడు ఎంట్రకాయల్ని జవరాల్సి పడతాది" అన్నాడు. అంటే నలగామూల దగ్గర జారుడు ఎక్కువ. జాగ్రత్తగా నడవకపోతే పడతామని చెప్పడం.

అప్పటికి మా పల్లెల్లో తమదల (రాగుల) వాడకం ఇంకా ఉంది. చిక్కటి మజ్జిగ కలిపిన గట్టి అంబలిని స్టీలు టిఫిన్‌లో పోసిచ్చినారు. అట్లే రెండు పులుసన్నం పొట్లాలు కట్టిచ్చినారు. తెల్లవారి ఆరు గంటలకు 'అటకాని తిప్ప'కు పొయ్యే బస్సు ఎక్కి కూచున్నాము. బస్సు బయల్దేరి కసారెడ్డిపాళెం, చెరువు కండ్రిగ, దావాది గుంటలు దాటి కుదిరికి వచ్చింది. కుదిరి వస్తే మా ఆనందం ఎక్కువవుతుంది. కుదిరి దాటగానే ప్రళయ కావేరి మొదలవుతుంది. ఇక కనుచూపు మేరా నీలాలు ఆరబోసినట్లు నీళ్ళు.

అరగంట ప్రయాణించి 'అటకాని తిప్ప'లో మమ్మల్ని దించింది బస్సు. ప్రళయ కావేరిలోని దీవులకు కేంద్రం 'అటకాని తిప్ప' దీవి. దీవులలో ఉండేవాళ్లు కూడా పేటకు (మా ఊరికి) రావాలంటే 'అటకాని తిప్ప'కు వచ్చే బస్సు ఎక్కాలి.

మూడునాళ్ళుగా ముసురుపట్టిన మబ్బుల చాటునుంచి సూర్యుడు తొంగి తొంగి చూస్తున్నాడు. అటకాని తిప్పలోని వినాయకుడి గుడి దగ్గరకు పోయి తెచ్చుకొన్న అంబలిలో కొంచెం తాగినాము.

*గెబ్బిడు: గబ్బెడు, పిడికెడు; తమదలు: రాగులు*



"ఏ ఊరికి సిన్నా?" ఒక ముసలాయన అడిగినాడు.

"మేము జల్లల దొరువుకీ, వీళ్ళు రాగన్న పట్టెడకీ" ఇద్దరి తరఫునా నేనే చెప్పినాను.

"జల్లలదొరువా! నాయినా దూరాబారం బొయ్యేవోళ్ళు. బిన్నా బయల్దేరండి. తూరుపు గాలి మళ్ళింది. వానొస్తాదేమో! ఇప్పుడు పెళయకావేట్లో దిగితేగానీ సద్దికూటేళకు 'కొరిడి'కి పోలేరు. ఉత్తర పొద్దులో యాడ్నో ఒక దెగ్గిర నిలబడిపోండి" అన్నాడా ముసలాయన.

మేము ఆ మాటతో దెబగుబా ప్రళయ కావేట్లో దిగినాము.

తూరుపు నుంచి, చల్లగాలీ లేత ఎండా కలిసి మమ్మల్ని గిలిగింతలు పెడుతున్నాయి. వానలు బాగాపడి సరస్సంతా నిండుగా ఉంది. అడుసు మీగాళ్ళనూ, నీళ్ళు మోకాళ్ళనూ దాటుతున్నాయి. వలస పక్షులు కూడా కొంచెం ముందుగానే వచ్చినట్లుండాయి. ఉల్లంకి పిట్టలు వేలకు వేలు బార్లు కట్టి నిలబడి ఉన్నాయి. వాటి రెక్కల పసిమి ఛాయ, నీటి నీలి వన్నె, ఎండ బంగరు రంగు కలిసి ప్రళయ కావేరి కొత్త హొయలు పోతోంది.

రెండు గంటలసేపు నీళ్లల్లో కాళ్ళీడ్చుకొంటూ సాగిన మా నడక 'కొరిడి' దీవికి చేరి కుదుట పడింది. దీవంటే గట్టినేల. కాలు చకచకా సాగుతుంది. అప్పటిదాకా గిలిగింతలు పెట్టిన సూర్యుడు, చుర్రుమనిపిస్తూ పైకి లేస్తున్నాడు. పేముపొదల దొరువులో కాళ్ళు కడుక్కొని, తియ్యని ఆ నీళ్ళు తాగి, నడక సాగించినాము.

కొరిడి దీవంతా చిట్టడవి. ఆ అడవిలోని పాలపండ్లు, కలిగిపండ్లు, బీరపండ్లు, బిక్కి పండ్లు, నిమ్మటాయలు, ఊటిపండ్లు, గొంజిపండ్లు, బలిజపండ్లు, ఎలిక చెవులూ, పిల్లోట్టలూ కోసుకొని తింటూ సాగుతున్నాం. అడివంతా చిన్న చిన్న, రంగు రంగుల పిట్టలు. వింత వింతగా పలుకరించుకొంటూ, కులుక్కుంటూ, గిలుక్కుంటూ, చెట్టు చెట్టుకు చెంగున ఎగురుకొంటూ, చెటాలున దోవ కడ్డంగా పరుగెడుతూ మమ్మల్ని పలుకరిస్తున్నాయి.

కొరిడి దాటిన తరువాత మళ్ళీ ప్రళయకావేరిలో గంటన్నర ప్రయాణం. తరువాత కొల్లపట్టు దీవి. కొల్లపట్టు నుంచి గంట ప్రయాణంలో తోటకట్ల. తోటకట్లకు చేరేసరికి మిట్టమద్దినేళ అయింది. ఎండ కసిగా కొడుతోంది. గాలి ఎంత చల్లగా తగులుతున్నా, చెమట కారుతూనే ఉంది. తోటకట్ల తరువాత గంట నడిస్తే 'రాగన్న పట్టెడ' వస్తుంది.

మాతోపాటు తెచ్చుకొన్న తిండి ఎప్పుడో అయిపోయింది. మధ్యాహ్నం ఒంటిగంటప్పుడు రాగన్న పట్టెడకు చేరుకొన్నాం. మా నేస్తాల ఊరు అదే. మేమయితే సగం వచ్చినట్లు, మా నేస్తాల ఇళ్ళలో మమ్మల్ని చూసి చాలా సంతోషించినారు. చెంగయ్య వాళ్ళ అమ్మ ఆదరాబాదరగా సంగటి గెలిగి, చెనిగ పప్పుల ఊరిబిండి నూరి కడుపునిండా పెట్టింది.

"ఈ పొద్దు ఈడ్నేవుండి రేపు బయదేలిపోండి నాయనా. ఉత్తర పొద్దు పెయాణం మంచిది కాదు" అన్నారు వాళ్ళింట్లోని పెద్దలంతా.

ఎప్పుడెప్పుడు జల్లల దొరువుకు పోదామా అని ఆత్రుతలో ఉన్న మేము వారి మాటలను వినలేదు. నేనూ, మా అన్నా బయలుదేరినాము.

ప్రళయకావేట్లో మిట్టమద్దినేళ ప్రయాణం కొంచెం కష్టమే. ఎండకు నీళ్ళు తళతళ

*బిన్నా: బిరాన, త్వరగా; మీగాళ్ళు: పిక్కలు; ఊరిబిండి: పచ్చడి*

లాడుతూ కళ్ళను జిగేలుమనిపించి దారి తప్పేటట్లు చేస్తాయి. దారి తప్పి మిట్టకు పోయినామా నీళ్ళ వేడికి కాళ్ళు బొబ్బలు లేస్తాయి. పల్లానికి పోయినామా, ఏ దిగులు తిప్పో తగిలి నడుములోతు అడుసులో కూరుకుపోతాము. అనుభవం ఉండే పెద్దలు దోవ పొడవునా అక్కడక్కడా కట్టెపుల్లలు నాటి ఉంటారు. వాటిని చూసుకొంటూ నడవాలి.

రాగన్నపట్టెడ తరువాత గంటన్నర నడకలో 'పంటరంగం' ఉంది. ఆ దీవిలో ఎవరూ కాపురం ఉండరు. పాతకాలం నాటి శివాలయం ఉంది అక్కడ. ప్రళయ కావేరి ప్రయాణీకులు ఆ శివాలయం దగ్గర విశ్రాంతి తీసుకొని పోతుంటారు. త్వరగా పోవాలనుకొనే వారు శివాలయానికి పోకుండానే మరో గంట ప్రయాణంలో వచ్చే 'చిన్న తోట' వైపు సాగిపోతారు. మేమూ అట్లాగే పోవాలనుకొన్నాము. కానీ, మేమనుకొన్నట్లు జరుగలేదు.

రాగన్నపట్టెడ తరువాత అరగంట నడిచినామో లేదో తూరుపు నుంచి పశువుల పండక్కి పరుగెత్తే బఱ్ఱెల మందలాగా గుంపులు గుంపులుగా మొయిళ్ళు బయలుదేరినాయి. మరుక్షణంలోనే నల్లగా మూసుకొనింది. కంటికి మింటికి ఏకధారగా వాన మొదలయింది.

ఇక మేము చిన్న తోటకు పోయే ఆలోచన మానుకొని పంటరంగం చేరుకొనేందుకు త్వరత్వరగా నడవసాగినాము. ఎగువ నుంచి ప్రవాళం వాగో, కాళంగినదో పరుగెత్తుకొచ్చి ప్రళయ కావేట్లో పడినట్లుంది. ప్రళయకావేట్లో సుళ్ళు పుట్టినాయి. దోవ పక్కన నాటిన పుల్లలు కొట్టుకొని పోయినాయి. మాకు పంటరంగం దీవి కంటికానడం లేదు.

మధ్యాహ్నం మూడు గంటలు కూడా అయివుండదు. కానీ చీకట్లు ముసురుకొన్నాయి. మేము గుడ్డి గురుతులతో చాలాసేపు నడిచి, నడిచి చివరకు పంటరంగం చేరుకొన్నాము. ఆ దీవంతా పెద్ద పెద్ద మానులతో చిక్కటి అడవి. వాటి మధ్యలోనే శివాలయం ఉంటుంది. ఆ గుడి దగ్గరకు పోతే, ఎవరో ఒకరు ప్రయాణీకులు ఉంటారు. కానీ గుడి దగ్గరకు పోవడానికి కాలిబాట కూడా దొరకడం లేదు. చివరకు నీటి వరవను పట్టుకొని ఎదురు నడిచినాము. ఆ వానలోనే గంటకు పైగా ఆ దీవిలో నడిచినాము. శివాలయం జాడేలేదు. నాకు చలికి తోడు, భయం కూడా మొదలై వణుకు ఎక్కువయింది. తిరిగి, తిరిగి గుడి కనబడక ఒక మర్రిచెట్టు కింద నిల బడినాము.

చీకటి చిక్కబడుతోంది. ఏనుగు తొండంతో చల్లినట్లు వాన కురుస్తూనే ఉంది. నేను భయంతో మా అన్నకు దగ్గరగా జరిగి నిలబడినాను. ఆయన పరిస్థితీ నాలాగే ఉన్నట్లుంది. నాకన్నా ఒక ఏడాది పెద్దవాడంతే. ఆ వానలోనే గంటకు పైగా ఆ దీవిలో నడిచినాము. ఇద్దరమూ ఏమీ మాట్లాడుకోవడం లేదు. ఒకరి కొకరం బాగా ఆనుకొని నిలబడినాము. ఇంతలో –

"ఎవుర్రా ఆడ, ఇయ్యాళప్పుడు ఈడకొచ్చింది?" అని కేక వినపడింది. మెరుపుననుసరించే ఉరుములాగా, కేకతోపాటు మనిషీ మా ముందుకొచ్చినాడు. నల్లగా, నిలువెత్తు మనిషి, తెల్లజుట్టు, ముడుతలు పడిన మొహం, వయసుడిగినా కండలు తిరిగిన దేహం.

---

*మొయిళ్ళు: మేఘాలు*



"మేము జల్లలదొరువుకు పోవాల తాతా! రాగన్నపట్టెడ దాటినాక వానొచ్చింది. పంటరంగం గుళ్ళో తలదాచుకొందామని వచ్చినాము. గుడి కనబడక ఈడ నిలబడినాం తాతా" మా అన్న అన్నాడు.

"ఓరి కొడకా! ఉత్తరపొద్దు ఏమార్చెను గదరా మిమ్మల్ని. పెద్దోళ్ళే ఉత్తర పొద్దులో పెళయకావేట్లో పెయాణం చెయ్యరు. ఏలిడంత లేరు మీరిద్దరూ ఎట్ట దాటదామనుకున్నార్రా? సూడబోతే మిడిమాళపు బిడ్డలు గుండారే?" అన్నాడు ఆ తాత.

మాకేమీ అర్థం కావడం లేదు. మళ్ళీ ఆ తాతే అడిగినాడు. "ఒరే! ఇప్పుడు మీరు యాడుండారో తెలుసా?" అని.

మేమిద్దరమూ అయోమయంలో పడి ఏమీ మాట్లాడలేదు.

"రాగన్నపట్టెడ నుంచి ఉత్తరానికి పోతే పంటరంగం. మీరు దోవతప్పి తూరుపుకు నడిచి 'రెట్టమూల'కు వచ్చుండారు. ఇది నరమానవులు తిరిగే దీవికాదు. తెలుసా మీకు?" తాత కంఠం ఖంగుమనింది.

మా పైప్రాణాలు పైనే పోయినట్లయింది. రెట్టమూల గురించి మా అవ్వాతాతలు అప్పుడప్పుడూ మాట్లాడుకొనే మాటలు గుర్తుకొచ్చినాయి.

'రెట్టమూల' కూడా ఒక దీవే. కానీ మనుషులెవరూ ఆ దీవికి పోరంట. కాలభైరవుడు ప్రేతగణాలతో ఆ దీవిలో తిరుగుతూ ఉంటాడంట. ఏడాదికొకసారి మాత్రం ఆ దీవిలో ఉండే కాలభైరవుని బొమ్మ దగ్గరకు, చుట్టూ దీవుల్లో ఉండే వాళ్ళు పొయ్యి పొంగళ్ళు పెట్టి వస్తారంట. ఇవన్నీ గురుతొచ్చి నాకు ఏడుపొచ్చింది. గట్టిగానే ఏడవడం మొదలుపెట్టినాను. ఎంతసేపటి నుంచి అణుచుకొని ఉన్నాడో, మా అన్నా ఏడవడం మొదలుపెట్టినాడు.

"రేయ్! అబ్బయ్యల్లారా! ఏడవ బాకండ్రా. నేనుండ్లా" అని ఆ తాత మాకు ధైర్యం చెప్పి ఆయనతో కూడా తీసుకోని పోయినాడు.

కొద్దిదూరం నడిచి ఒక చిన్న గుడిసె దగ్గరికి పోయినాము. "రాండ్రా లోపలికి" అన్నాడు తాత. లోపల తాత పొయ్యి రాజేసి మంట పెట్టినాడు. మేము మంట దగ్గర కూర్చుని చలికాసుకొన్నాము. తాత అన్నం వండి, తక్కోలం కాయలు పులుసు పెట్టినాడు. చుట్టూ కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి. పొయ్యి మంట చీకటినీ, చలినీ గుడిసెలో నుంచి తరిమేస్తూ ఉంది. తాత మట్టి మూకుడులో అన్నం కలిపి మాకు చెరినాలుగు పిడచలు చేతిలో పెట్టినాడు.

మాకు ప్రాణం కుదుటపడింది. తాత ఏవో తత్వాలు పాడడం మొదలుపెట్టినాడు. నాకు కడుపులో ముద్దపడి, ఒంట్లోకి వెచ్చదనం వచ్చేసరికి, బుర్ర పనిచేయడం మొదలయింది. పొద్దున్నించీ నన్ను పీడిస్తున్న ఒక సందేహాన్ని తాత ముందు పెట్టినాను.

"తాతా, తెల్లారినించీ చానా మంది ఉత్తరపొద్దు, ఉత్తర పొద్దు అంటుండారు. అంటే ఏంది తాతా?" అడిగినాను.

---

*మిడిమాళం: మిడిమేలం, పొగరు; తక్కోలంకాయలు: టమోటాలు; పిడచ: ముద్ద*

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=478**